నేడు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మహత్మ జ్యోతిభాపూలే 199వ జయంతి వేడుకలను శుక్రవారం ఉదయం 10:30 గంటలకు శాతవాహన యూనివర్సిటీ చౌరస్తా, విజయ పురి కాలనీ, మల్కాపూర్ రోడ్ వద్ద నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అనిల్ ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ సంఘం నాయకులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరువావాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

● తరుగు, కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి ● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్

కరీంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్‌తో కలిసి యాసంగి ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాలశాఖ అధికారులు, రైసు మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన ధాన్యంలో తరుగు, కోతలు విధించకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం కల్లాల వద్ద రైతులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు ప్రభుత్వం ఎలాంటి లోటు రానివ్వడం లేదని అన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు రూ.500 బోనస్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. చొప్పదండి నియోజక వర్గంలో ఒక్క గుంట భూమి కూడా ఎండి పోకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు ఇస్తున్నామని అన్నారు. గత కొనుగోళ్లలో రైతుకు 48 గంటల్లోనే ధాన్యం విక్రయించిన సొమ్మును చెల్లించినట్లు తెలిపారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తేమ, తాలు పేరిట ధాన్యంలో కోతలు, కటింగ్ వంటివి చేయరాదని అన్నారు. ధాన్యాన్ని వెంటవెంటనే తరలించాలని సూచించారు. రైసుమిల్లర్ల సమస్యలు ఏమైనా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే సత్యం హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో గత సీజన్‌లో ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్లను సజావుగా చేశామని గుర్తు చేశారు. ప్రస్తుత యాసంగిలోనూ అదే తరహాలో ఎలాంటి కోతలు విధించకుండా ధాన్యం కొనుగోలు చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రజనీకాంత్, జిల్లా రైసు మిల్లర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.

24/7 డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు



● మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే
● ఏడాదిలో 6,005 కేసులు, 147 మందికి జైలుశిక్ష
● ఇక పగలు, రాత్రి డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపితే ఇక జైలు ఊచలు లెక్కబెట్టాల్సిందే. ఇప్పటి వరకు రాత్రి సమయాల్లో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు ఇక నుంచి 24 గంటలపాటు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు. సమయం అనేది లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టనున్నారు.

ఇందుకోసం బ్రీత్‌ఎనలైజర్ పరికరాలు మరిన్ని సమకూర్చు కుంటున్నారు. 2024లో ఏడాది కాలంలో మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 6,005 మంది వాహనదారులు పట్టుబడ్డారు. ఇందులో 147 మంది వాహనదారులకు కోర్టు జైలు శిక్ష విధించింది. రాత్రి వేళల్లో జరిగే రోడ్డు ప్రమాదాలలో 90 శాతం వరకు మద్యం సేవించి వాహనాలు నడపడంతోనే జరుగుతున్నాయని గతంలో జరిగిన ప్రమాదాల విశ్లేషణలో వెల్లడైంది. 2024లో 184 మంది రోడ్డు ప్రమాదాల బారినపడి మృతిచెందారు.

కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్

డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన వాహనదారులను కోర్టుల్లో హాజరుపరచి వారిలో మార్పు తీసుకురావటానికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వహనదారులు జరిమానా చెల్లించటానికి, చివరకు జైలు శిక్షకు కూడా అంగీకరిస్తుండగా కుటుంబ సభ్యుల మధ్య కౌన్సెలింగ్ అంటేనే జంకుతున్నారు. మళ్లీ మద్యం సేవించి వాహనం నడపనంటూ కుటుంబ సభ్యుల మధ్య ప్రతిజ్ఞ చేయిస్తున్నారు.

వీర హనుమాన్ విజయయాత్రకు పటిష్ట బందోబస్తు

పోలీసు కమిషనర్ గౌష్ ఆలం



నగరంలో యాత్ర మార్గంలో అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 12న కరీంనగర్‌లో నిర్వహించనున్న శ్రీ వీరహనుమాన్ విజయయాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గురువారం టౌన్ ఏసీపీ కార్యాలయంలో డివిజన్‌లోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ యాత్ర కరీంనగర్‌లోని వైశ్యభవన్ పక్కన రామాలయం నుంచి ప్రారంభమై రాజీవ్‌చౌక్, టవర్ సర్కిల్, గంజ్ రోడ్, రూరల్ పోలీస్‌స్టేషన్ చౌరస్తా, కమాన్ రోడ్ మీదుగా , బస్టాండ్, తెలంగాణ చౌక్, ఐబీ చౌరస్తా, కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ స్టాట్యూ తిరిగి రామాలయం వద్ద ముగుస్తుందని తెలిపారు. దాదాపు ఆరు కిలోమీటర్ల మేర నిర్వహించే యాత్రకు 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పోలీసు కమిషనర్ తెలిపారు. యాత్రలో సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు పోలీసు డ్రోన్‌లను వాడనున్నట్లు తెలిపారు. యాత్ర నిర్వహించే మార్గంలో పోలీసు కమిషనర్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, సీఐలు బిల్లా కోటేశ్వర్, సృజన్‌రెడ్డి, జాన్‌రెడ్డి, ఖరీముల్లాఖాన్‌లతో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కడుపు నింపేందుకు సన్నబియ్యం పథకం

● మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ● లబ్ధిదారుడి ఇంట్లో ఎమ్మెల్యే, కలెక్టర్ భోజనం



వంకాయగూడెంలో సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్

శంకరపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపేందుకే సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పథకం అమలు చేశారని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం శంకరపట్నం మండలం వంకాయగూడెంలో సన్నబియ్యం లబ్ధిదారుడు చలిగంటి మమత-గణేష్ దంపతుల ఇంట్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణలతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేదవాడి ఆత్మ గౌరవ పథకమన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందు కెళ్తుందని, అందులో భాగమే సన్నబియ్యం పంపిణీ అన్నారు. లబ్ధిదారుని కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సన్నబియ్యం లబ్ధిదారుడు చలిగంటి గణేష్ మాట్లాడుతూ సన్నబియ్యంతో ఎమ్మెల్యే, కలెక్టర్‌కు తమ ఇంట్లో భోజనం వడ్డించడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

హోటళ్లలో అధికారుల తనిఖీలు



కరీంనగర్‌లోని హోటల్‌లో అధికారుల తనిఖీలు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్‌సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహిస్తున్నారు. నగరంలోని చాలా హోటళ్లలో పరిశుభ్రతను పాటించడం లేదని, వంటనూనెలను వేడి చేస్తూ ఎక్కువసార్లు వినియోగిస్తున్నారని, ఎక్స్‌పైరీ వస్తువులను, క్వాలిటీ లేని సరుకులను వాడుతున్నట్లు గుర్తించామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సువార్త తెలిపారు. నాణ్యత లేని సరుకులను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ వేణుమాధవ్, జిల్లా ఫుడ్ ఇన్స్ పెక్టర్ సునీత, తూనికలు కొలతల శాఖ అధికారి భూలక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ

ఫేస్ టు ఫేస్



ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏసీపీ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు, మేసేజ్‌లు, లింక్‌లు వస్తే స్పందించవద్దు. సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930కు డయల్ చేయాలి. ప్రజలకు, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి, డ్రగ్స్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ఏసీపీ: గంజాయి, డ్రగ్స్, గుట్కా అమ్మినట్లయితే హుజూరాబాద్ డివిజన్ పోలీసులకు నేరుగా సమాచారం అందించవచ్చు. డివిజన్‌లో 72 ఆంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేశాం. గ్రామాల్లో రాత్రి వేళ పోలీసుల గస్తీ తిప్పుతున్నాం. గంజాయి అమ్మేవారిపై నిఘా ఏర్పాటు చేశాం. ఎవరైనా విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

ఆంధ్రజ్యోతి: శాంతిభద్రత విషయంలో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.?

ఏసీపీ: శాంతిభద్రతల విషయంలో విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని అమలు పరుస్తున్నాం. గ్రామాల్లో రెండు వర్గాల మధ్య గొడవలు ఉన్న వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. నేషనల్ హైవే రహదారి పనులు జరుగుతున్నందున ప్రమాదలు నివారించేందుకు సూచికలు ఏర్పాటు చేశాం. స్పీడ్‌గా వాహనాలు నడపవద్దు.

ఆంధ్రజ్యోతి: వాహనదారులకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు.?

ఏసీపీ: ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. మద్యం సేవించి పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. - హుజూరాబాద్

అసౌకర్యాల మధ్య బాలభవన్

● పిల్లలకు తప్పని ఇబ్బందులు
● తాత్కాలిక భవనంలో శిక్షణ
● 24 నుంచి వేసవి శిక్షణ తరగతులు



అంబేద్కర్ స్టేడియంలో కొనసాగుతున్న బాలభవన్



సంగీతం నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల కోసం ఉమ్మడి జిల్లాలో సుమారు 45 సంవత్సరాల క్రితం బాలకేంద్రం ప్రారంభమైంది. అది బాలభవన్‌గా మూడు సంవత్సరాల క్రితం అప్‌గ్రేడ్ అయింది. గత కొన్నేళ్ళుగా అంబేద్కర్ స్టేడియంలో అసౌకర్యాల మధ్య తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతియేటా ఏప్రిల్, మే మాసాలతో పాటు సమ్మర్, నాన్ సమ్మర్‌లలో ఆయా రంగాల్లో బాలభవన్ ద్వారా పిల్లలు శిక్షణ పొందుతుంటారు. సరైన వసతి సౌకర్యాలు లేకపోవడంతో సిబ్బందికి, పిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదు. అర్హత, అనుభవమున్న సిబ్బంది ఉన్నా భవనం లేకపోవడం, మౌలిక వసతులు కల్పించకపోవడంతో బాల భవన్‌ను సమస్యలు వెంటాడుతున్నాయి.

భూమి కేటాయింపుకే పరిమితం

2010లో అప్పటి కలెక్టర్ చొరవతో ఓల్డ్ ఎంప్లాయిమెంట్ ఆఫీసు వెనుక వీధిలో 15 గుంటల భూమిలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ-బాలసదన్‌కు పోను 7 గుంటల భూమిని బాలకేంద్రానికి కేటాయించారు. స్మార్ట్ సిటీ నిధులతో కొత్త భవనాన్ని నిర్మిస్తామన్న మాటలు నీటి మూటలయ్యాయి. రెగ్యులర్ స్టాఫ్ 5గురు, ఒక ఆయాతో కలిపి ఆరుగురు పనిచేస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 7 వరకు శిబిరం పని చేస్తుంది. నాన్ సమ్మర్ కోచింగ్‌లో భాగంగా ప్రతిరోజూ రెగ్యెలర్ స్టాఫ్‌తో పాటు మరో ఐదుగురు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంగీతం, టైలరింగ్, డ్రాయింగ్, తబల/మృదంగం, నృత్యం నేర్పిస్తుంటారు. సమ్మర్ కోచింగ్‌లో శాస్త్రీయ, జానపద నృత్యాలు, అబాకస్, చెస్, యోగా వంటివి నేర్పుతుండగా ఈ యేడు కర్రసాము కూడా నేర్పించనున్నారు. పిల్లలకు అభివృద్ధితో కూడిన శిక్షణకు ఓ శాశ్వత భవనం అవసరమని అందరూ భావిస్తున్నారు.

ఓ భవనం ఉంటే అనుకూలంగా ఉంటుంది

కట్ట మంజులాదేవి, సూపరింటెండెంట్, బాలభవన్



శాశ్వత భవనం ఉంటే విద్యార్థుల సంఖ్య పెరిగే అవ కాశం ఉంది. ఈ యేడు స్టేడియంలోనే తరగతులు నిర్వహించక తప్పడం లేదు. 2024లో 800 వరకు మంది పిల్లలు రాగా ఈ యేడు కూడా 800 మంది ఆయా రంగాల్లో శిక్షణ కోసం వస్తారని అనుకుంటున్నాం. తక్కువ సంఖ్య గల ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కేటాయిస్తే బాగుంటుంది. లేదా అందరికీ అనువుగా ఉండే జిల్లా కేంద్రానికి సమీపంలో స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణం చేస్తే బాగుంటుంది.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

మే 1 నుంచి 30వ తేదీ వరకు శిబిరాలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్ర క్రీడాపాధికార సంస్థ వీసీ అండ్ ఎండి హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో మే నెల 1 నుంచి 30వ తేదీ వరకు వివిధ క్రీడాంశాల్లో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ అందించేందుకు ఆసక్తి కలిగిన పీడీలు, పీఈటీలు సీనియర్ జాతీయ క్రీడాకారులు అర్హులు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు జిల్లా వ్యాప్తంగా ఉన్న పది గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించనున్నారని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి వి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తిగల అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో ఈ నెల 20న సాయంత్రం 5 గంటలలోపు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో క్రీడాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన తెలిపారు. అలాగే దరఖాస్తు ఫారం ఇతర వివరాలకు సెల్ నెంబర్లు 8008326913, 9640967943 సంప్రదించాలని సూచించారు.

ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సీహెచ్ పూజ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌పోటీలకు జిల్లాకు చెందిన అథ్లెటిక్ క్రీడాకారిణి సీహెచ్ పూజ ఎంపికైంది. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెలలో జరగనున్న ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌పోటీల్లో పూజ తెలంగాణ రాష్ట్ర జట్టునుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ నెలలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్ విభాగంలో విశేష ప్రతిభచాటి ఏడోస్థానం సాధించి సీనియర్‌మహిళల విభాగంలో జిల్లా నుంచి మొట్టమొదటిసారిగా ఇండియన్ అథ్లెటిక్స్‌పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పూజను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి, అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

కథల పోటీల్లో ఆవునూరు విద్యార్థిని ప్రతిభ



శృతిక

గంబీరావుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన కథలపోటీల్లో ముస్తాబాద్ మండలం ఆవునూరు ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఎలుసాని శృతిక రాసిన కథ ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. ఈ కథల పోటీల్లో ఉభయ రాష్ట్రాల నుంచి 541 కథలు రాగా, అందులో 35 మంది రాసిన కథలను ఎంపిక చేశారు. జూన్ మాసంలో హైదరాబాద్ రవీంద్రభారతీలో శృతికకు సన్మానంతో పాటు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు బాలసాహిత్యానికి చెందిన పుస్తకాలు అందజేస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మన్ తెలిపారు.

మూడు కాళ్ల కోడి



మూడు కాళ్లతో ఉన్న కోడి


తంగళ్లపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లిలోని ఓ పౌల్ట్రీ ఫాంలో మూడు కాళ్ల కోడిని నిర్వాహకుడు గురువారం గుర్తించాడు. గ్రామంలోని రాజిరెడ్డికి చెందిన పౌల్ట్రీ షెడ్‌ను లక్ష్మణ్ అనే వ్యక్తి లీజుకు తీసుకొని బాయిలర్ కోళ్లను పెంచుతున్నాడు. కోళ్లకు మేత వేస్తున్న క్రమంలో మూడుకాళ్ల కోడి లక్ష్మణ్‌కు కనిపించింది. ఈవిషయం గ్రామస్థులకు తెలియడంతో కోడి ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

పిడుగుపాటుతో దున్నపోతు మృతి

గన్నేరువరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో బుధవారం రాత్రి అకాల వర్షంతోపాటు పిడుగుపడగా గ్రామానికి చెందిన రైతున్యాలపట్ల రాజయ్యకు చెందిన దున్నపోతు మృతిచెందింది. సుమారు 30వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఉపాధికి మార్గం పాలిటెక్నిక్ డిప్లొమా

- పదో తరగతి విద్యార్థులకు అవకాశం
- తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య
- పాలిసెట్-25 పిలుస్తోంది



చొప్పదండి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక కాలంలో ఉత్పత్తి రంగానికి, సాంకేతిక విద్య అభ్యసించే వారికి డిమాండ్ అధికంగా ఉంది. అందులో పదో తరగతి పూర్తి కాగానే వెంటనే ఉత్పత్తి ఆధారిత రంగాల్లో చదువుకోవాలనే విద్యార్థులకు పాలిటెక్నిక్ ఒక అద్భుతమైన మార్గం. పాలిటెక్నిక్ కోర్సు చదివిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయి. విద్యార్థులకు 'పాలిసెట్' ప్రవేశ పరీక్ష ద్వారా పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేందుకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పదో తరగతి తర్వాత ఇంజనీరింగ్ టెక్నికల్ కోర్సుల్లో చేరి సత్వర ఉపాధి పొందవచ్చు. అలాంటి విద్యార్థులకు చక్కటి మార్గం పాలిటెక్నిక్ డిప్లొమా. డిప్లొమా కోర్సు పూర్తయ్యాక వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

- పాలిటెక్నిక్‌లో చేరి చదువుకుంటే విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుంది. చిన్న వయసులోనే ప్రత్యేకంగా తమకిష్టమైన రంగంలో నైపుణ్యం సాధించొచ్చు. పాలిటెక్నిక్‌లో విద్యార్థులు తక్కువ ఖర్చుతో సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకొని మంచి భవిష్యత్తును రూపొందించుకోవచ్చు. పది పాసైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు ఒక సువర్ణ అవకాశం.

● కోర్సుల వివరాలు

పాలిటెక్నిక్‌లో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు ఉంటుంది. పదవ తరగతి నుంచి ప్రశ్నలు ఉంటాయి. డీఈఈఈ, డీఎంఈ, డీసీఎంఈ, సివిల్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ వంటి 24 కోర్సులు ఉంటాయి. కళాశాలలోని ఒక్కో కోర్సులో 60 సీట్లు అందుబాటులో ఉంటాయి. డిప్లొమా అనంతరం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించి పలు కంపెనీలు ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉద్యోగాలు కుడా ఈ డిప్లమా కోర్సు ద్వారా సాధించవచ్చు. ఈ-సెట్ ప్రవేశ పరీక్ష రాసి బీటెక్‌లో నేరుగా ద్వితీయ సంవత్సరంలోకి చేరే అవకాశం ఉంటుంది. అందరి లాగానే బీటెక్ చేసి గ్రాడ్యుయేట్ కావచ్చు. కొన్నికళాశాలల్లో హాస్టల్ సదుపాయాలు కూడా ఉన్నాయి.

● వ్యవసాయ అనుబంధ కోర్సులు

ఇంజనీరింగ్. అగ్రి. వెటర్నరీ హార్టికల్చర్ డిప్లమా కోర్సులలో ప్రవేశం పొందవచ్చు. వ్యవసాయ విద్య విశ్వవిద్యాలయం పరిధిలో రెండేళ్ల అగ్రికల్చర్ డిప్లమా, ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లమా, మూడేళ్ల వ్యవధిలో పూర్తయ్యే డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సులో పాలిసెట్ ద్వారా ప్రవేశం పొందవచ్చు. వెటర్నరీ విశ్వ విద్యాలయం పరిధిలో రెండేళ్ల యానిమల్ హస్బెండ్రీ పాలిటెక్నిక్ కోర్సు, ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో రెండేళ్ల డిప్లమా ఇన్ హార్టికల్చర్ కోర్సుల్లో సీట్ల భర్తీకి పాలిసెట్-25 నోటిఫికేషన్ విడుదల అయ్యింది.



పాలిసెట్ వివరాలు

- ఏప్రిల్ 19 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.
- 100 రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 23 వరకు, దరఖాస్తు చేసుకోవచ్చు.
- మే13న ప్రవేశ పరీక్ష
- పరీక్ష సమయం 2-30 గంటలు
- 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

గణితం నుంచి 60 మార్కులు, భౌతిక శాస్త్రం-30, రసాయన శాస్త్రం-30, జీవశాస్త్రం-30 మార్కుల చొప్పున పదవ తరగతి సిలబస్ ప్రశ్నలు ఉంటాయి.

- పూర్తి వివరాలకు https://polycet.sbtet.telangana.gov.in సైట్‌లో చూసుకోవచ్చు.

ఫీజు వివరాలు: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 250 రూపాయలు. బీసీ, జనరల్ విద్యార్థులకు 500 రూపాయలు.

అర్హతలు : పదో తరగతి పాస్ అవ్వాలి. 2025లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 డిసెంబర్ 31 నాటికి విద్యార్థుల వయస్సు 15 నుంచి 22 ఏళ్ల మధ్యలో ఉండాలి.

చికిత్సపొందుతూ గర్భిణి మృతి

కరీంనగర్‌క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రక్తస్రావంతో బాధపడుతూ కరీంనగర్ మాతాశిశుకేంద్రంలో చికిత్సపొందుతూ జంగంపల్లి సంధ్య అనే గర్భిణి గురువారం ఉదయం మృతిచెందింది. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా తాండూర్ గ్రామానికి చెందిన సంధ్య బుధవారం అనారోగ్యానికి గురైంది. మంచిర్యాలలోని ఒకప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని, మెరుగైనచికిత్స కోసం కరీంనగర్‌లోని మాతాశిశు కేంద్రానికి వచ్చింది. ఇక్కడచికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలు సంధ్య భర్త జంగంపల్లి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదుతి మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పాలకుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కన్నాల గ్రామానికి చెందిన కొల్లూరి రాయమల్లు (73) ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య అనారోగ్య కారణాలతో గతంలో మృతిచెందడంతో రాయమల్లు ఒంటరిగా ఉంటున్నాడు. పెద్దపల్లిలో నివాసం ఉంటున్న రాయమల్లు కుమారుడు పలుమార్లు అతడివద్దకు రావాలని కోరినా వెళ్లలేదు. భార్య చనిపోయిన విషయాన్ని మనస్సులో పెట్టుకుని మనోవేదనతో బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగగా గమనించిన స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన మహ్మద్ అజీజ్(31) అనే యువకుడు బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజీజ్ కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడన్నారు. బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి తన భార్యను డబ్బులు అడిగితే ఇవ్వకపోవటంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అనంతరం అనుమానం వచ్చి గదిలో చూసేసరికి ఉరివేసుకుని ఉన్నాడు. తాగిన మైకంలో అజీజ్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతి

రామడుగు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెదిర శివారులోని కరీంనగర్-జగిత్యాల ప్రధానరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ మున్సిపల్‌కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్ రాజశేఖర్ మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రామడుగు మండలంలోని వెదిర పరిధిలోని రాజాజీనగర్‌కు చెందిన కుమ్మరి రాజశేఖర్(27) కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తూ అనూహ్యంగా బ్రిడ్జి వద్ద చెట్టుకు ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేములవాడ ప్రధాన రహదారి కొలతల సేకరణ



వేములవాడలో ప్రధాన రహదారిలోని భవనాల కొలతలు వేస్తున్న అధికారులు

వేములవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి ఇరువైపులా దుకాణాలు, భవనాల కొలతలను అధికారులు సేకరిస్తున్నారు. మెయిన్ రోడ్డు విస్తరణలో ఇండ్లు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు కోల్పోనున్న నిర్వాసితుల తుది జాబితా సిద్ధం చేసే క్రమంలో వివిధ శాఖలకు చెందిన 24 మంది అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి గురువారం కొలతలు సేకరించారు.

ఎదురెదురుగా ఢీకొన్న ఆటో, ఆర్టీసీ బస్సు

● ఆటోలో మందుగుండు సామగ్రిని గుర్తించిన పోలీసులు

గంగాధర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మధురానగర్‌వద్ద జాతీయ ప్రధానరహదారిపై ఆటో, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాలప్రకారం టీజీ 02 టిటి1770 నంబరుగల ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. జగిత్యాల నుంచి కరీంనగర్‌వైపు రెండు నెంబర్లు గల ఆటో(ఏపి36 టిబి5246,ఏపి36డబ్ల్యు6231) గంగాధర మండలం మధురానగర్ జాతీయ ప్రధానరహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆటోలోని బాక్సులను తీసి బయటపడేసి డ్రైవర్ పరారయ్యాడు. విషయాన్ని బస్సుడ్రైవర్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ప్రమాదస్థలంలోని బాక్సులను పరిశీలించారు. బాక్సుల్లో పేలుడు పదార్థాలు(400జిలిటెన్ స్టిక్స్), వాటికి ఉపయోగించే వైరు బెండల్ లభించింది. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగకపోవడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సుడ్రైవర్ మెరుగుశ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి అక్రమంగా, అనుమతిలేకుండా పేలుడు పదార్థాలను తరలిస్తు గుర్తుతెలియని ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆటోలో లభించిన జిలిటెన్ స్టిక్స్

హనుమాన్ ఆలయంలో దొంగతనం

మానకొండూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయం గ్రామశివారులో ఉండడంతో రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగులకొట్టి హుండీలోని నగదు రూ.15వేలు, 10తులాల వెండిని ఎత్తుకెళ్లారు. గురువారం ఎప్పటిలాగే పూజారి ఆలయానికి వెళ్లగా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి ఆలయకమిటీకి తెలియజేశారు. కమిటీతో పాటు గ్రామస్థులు ఆలయానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ లక్ష్మీనారాయణ దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని టీఆర్‌నగర్‌లో తనిఖీలు చేయగా ఎండీ.యాసిర్ అనే వ్యక్తి వద్ద 145 గ్రాముల గంజాయిని సీసీఎస్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. గంజాయిని జగిత్యాల రూరల్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ వినోద్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఓ లాడ్జీలో పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. ఎనిమిదిని పట్టుకొని, వారివద్ద నుంచి రూ.16,710 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్‌స్టేషన్ పరిధిలోని నర్సింగాపూర్ గ్రామశివారులో పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 10,180 నగదుతో పాటు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

రేపు పునఃప్రారంభం కానున్న

కాజీపేట్-దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలు

పెద్దపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ కుంభమేళా సందర్భంగా రద్దయిన కాజీపేట్-దాదర్ వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 12వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. నంబర్ 07197/98గల కాజీపేట- దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం నుంచి నడవ నున్నది. ఈ రైలు జూన్ 28వ తేదీవరకు ఎగువ, దిగువ ఇరువైపులా 24 ట్రిప్పులు నడవనున్నది. ప్రతీశనివారం కాజీపేటలో ఉదయం 11:30గంటలకు బయలుదేరి పెద్దపల్లిజంక్షన్‌కు 12:36గంటలకు చేరుకోనున్నది. మరుసటిరోజు మధ్యాహ్నం1:26 గంటలకు దాదర్ చేరుకొంటుంది. తిరుగు ప్రయాణంలో ఆదివారం మధ్యాహ్నం3:25 గంటలకు దాదర్‌రైల్వేస్టేషన్ నుంచి బయలు దేరి మరుసటిరోజు సోమవారం రాత్రి7:38 గంటలకు పెద్దపల్లిజంక్షన్‌కు, రాత్రి9:30 గంటలకు కాజీపేట చేరుకోనున్నది. ఈ రైలు కరీంనగర్ జిల్లా జమ్మికుంట స్టేషన్‌లో కూడా ఆగనున్నది. కాజీపేటనుంచి జమ్మికుంట, పెద్దపల్లి, బల్లార్షా, ఆదిలాబాద్, నాందేడ్ మీదుగా ప్రయాణిస్తుంది. నంబర్07195/96గల కాజీపేట- దాదర్, వయాపెద్దపల్లిజంక్షన్, నిజామాబాద్ మీదుగావెళ్లే రైలును ఇంకా పునరుద్ధరించలేదు. ఈరైలును పునరుద్ధరిస్తే 200 కిలోమీటర్ల దూరం తగ్గడంతోపాటు సమయం, డబ్బులు ఆదా కానున్నాయని ఆ రైలును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం పెద్దపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీపీ కార్యాలయంలో డీసీపీ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బండారికుంటకు చెందిన షేక్‌ఆసిఫ్ కొన్నేళ్లుగా ఇతరప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నాడని వెల్లడించారు. ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్న ఆసిఫ్ జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నట్లు డీసీపీ పేర్కొన్నారు. నిందితుడికి గతంలోనూ నేర చరిత్ర ఉందన్నారు. 2016 నుంచి 2024 మధ్య అతనిపై ఎనిమిది గంజాయి కేసులు నమోదయ్యాయని, పిడి యాక్ట్ కింద కూడా శిక్ష అనుభవించాడని డీసీపీ తెలిపారు. పోలీసుల నిఘా పెరగడంతో ఆసిఫ్ మొగ్దుంపూర్‌కు మకాం మార్చాడన్నారు. కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ఆటో నడుపుతూ గంజాయి విక్రయిస్తున్నాడన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌చెందిన సల్మాన్ అనేవ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి విద్యార్థులు, యువతకు విక్రయిస్తున్నాడని తెలిపారు.

పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గంజాయి కోసం ఎదురుచూస్తున్న వారికి వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చి విక్రయిస్తుండగా పోలీసులు అతన్ని పట్టుకున్నట్లు డీసీపీ కరుణాకర్ వివరించారు. రూ.50వేల గంజాయితోపాటు, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిని పట్టుకొన్న సీఐ కె.ప్రవీణ్ కుమార్,ఎస్సై జె. లక్ష్మణ్ రావు,సిబ్బందిని డీసీపీ అభినందించారు.

అకాల వర్షంతో.. అన్నదాతకు నష్టం..

●నేలకొరిగిన మొక్కజొన్న, నేలరాలిన మామిడి ● కళ్లాల్లో తడిసిన ధాన్యం

గన్నేరువరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం అర్ధరాత్రి కురిసిన అకాలవర్షం మాదాపూర్ గ్రామంలో బీభత్సం సృష్టించింది. అకాలవర్షంతోపాటు ఈదురుగాలులతో చేతికి వచ్చిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. మామిడితోటల్లో మామిడి కొమ్మలు విరిగిపడడంతో పెద్దమొత్తంలో మామిడి నేలరాలి రైతులకు అపార నష్టం వాటిల్లింది. మాదాపూర్ గ్రామానికిచెందిన రైతులు మాదుగుల మహేష్, గొడుగు స్వామికి చెందిన మొత్తం నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరిగింది. ఇదేగ్రామంలో మామిడితోటల్లో భారీ నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పంటనష్టాన్ని ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అనంతగిరిలో వడగళ్ల వాన..

ఇల్లంతకుంట: మండలంలోని పలుగ్రామాల్లో పడిన వడగళ్లవానతో భారీగా పంటలకు నష్టంవాటిల్లింది. అనంతగిరి, పెద్దలింగాపూర్, తిప్పపూర్ గ్రామాల సమీపంలోని పంట పొలాలపై బుధవారం అర్ధరాత్రి గంటపాటు రాళ్ల వాన పడింది. దీంతో కోతకు వచ్చిన దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలోని వరిచేన్లు భారీగా దెబ్బతిన్నాయి. తమకు వడగళ్ళు తీరని నష్టం కలిగించాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మూడు గ్రామాల్లో జరిగిన నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపినట్లు పేర్కొన్నారు.

వేములవాడ రూరల్: బుధవారం అర్ధరాత్రి కురిసిన గాలివాన మండలంలో బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో కురిసిన గాలివానతో తీవ్రపంటనష్టం వాటిల్లింది. బొల్లారం గ్రామంలో వరిపంట నేలకొరిగి ధాన్యం రాలిపోయింది. దీంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాగాయపల్లి గ్రామంలో గాలివానకు రోడ్డుపై విరిగిపడ్డ చెట్లను బ్లూకోల్ట్స్ పోలీసులు తొలగించారు. ప్రధానరహదారిపైచెట్లు విరిగి పడిపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా పోలీసు సిబ్బంది శ్రీనివాస్, మల్లేశం స్థానికులతో కలిసి తొలగించారు.

తడిసిన ధాన్యం..

కోనరావుపేట/గంభీరావుపేట: కోనరావుపేట, గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. మంగళపల్లెలో మొక్కజొన్న నేలకొరిగింది. ఒక్కసారి రాత్రి రావడం వల్ల రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఇబ్బందులు పడ్డారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

ఇల్లందకుంట: ఈదురుగాలులతో నేలకొరిగిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘం కరీంనగర్ జిల్లాకమిటీ సభ్యుడు చెల్పూరి రాము అన్నారు. గురువారం మండలంలోని శ్రీరాములపల్లిలో ఈదురు గాలులతో నేలకొరిగిన మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాము మట్లాడుతూ మండలంలో సుమారు 150ఎకరాల వరకు మొక్కజొన్న పంట నేలకొరిగిందన్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎకరానికి రూ.50వేలు ఇప్పించాలన్నారు. లేకపోతే రైతులందరితో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



కోనరావుపేట మండలం మంగళపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న



గంభీరావుపేట మండలం గజసింగవరంలో వర్షానికి తడిసిన ధాన్యం



వేములవాడ నాగాయపల్లిలో విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు



అనంతగిరి గ్రామంలో పడిన వడగళ్లు



గన్నేరువరం: నేలవాలిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతు మాదుగుల మహేష్

గల్ఫ్ అడ్వైజరీ కమిటీ గౌరవ సభ్యుడిగా ఆది శ్రీనివాస్




ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమం కోసం రూపొందించనున్న ఎన్నారై పాలసీ అడ్వైజరీ కమిటీ గౌరవ సభ్యుడిగా వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియమితులయ్యారు. అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి బీఎం వినోద్‌కుమార్, వైస్‌చైర్మన్‌గా మంద భీమ్‌రెడ్డి, గౌరవ సభ్యులుగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్‌ను నియమించారు. సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, లిజీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాసరావు, కొట్టాల సత్యనారాయణగౌడ్(దుబాయ్), గుగ్గిళ్ళ రవీందర్, నంగి దేవేందర్, పరికిపండ్ల స్వదేశ్‌ను ఈకమిటీలో సభ్యులుగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎన్ఆర్ఐ పాలసీ రూపకల్పన నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ కమిటీలో జిల్లా నుంచి ప్రభుత్వ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు అవకాశం లభించడం విశేషం.

బాలికపై అత్యాచారయత్నం

ఎలిగేడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామంలో ఒకటవ తరగతి చదువుతున్న బాలికపై యువకుడు (25) అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం పాఠశాల నుంచి బాలిక ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులకు గ్రామంలో పని ఉండడంతో ఇంటి సమీపంలో ఉన్న దగ్గరి బంధువు వద్ద బాలికను ఉండమని చెప్పి వెళ్ళారు. దీనిని అదునుగా తీసుకొన్న యువకుడు బాలికపై వికృత చేష్టలకు పాల్పడినట్లు తెలిసింది. ఇంటికి తిరిగివచ్చిన తల్లిదండ్రులకు బాలిక అక్కడ జరిగిన విషయాన్ని ఏడ్చుకుంటూ చెప్పింది. దీంతో తల్లిదండ్రులు జూలపల్లి పోలీసులకు సమాచారం అందించారు.

వస్తున్నాం..అంజన్నా..





విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న అంజన్న ఆలయం

- నేటి నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు
- కొండగట్టులో మూడు రోజుల పాటు వేడుకలు
- తరలిరానున్న లక్షలాది భక్తులు

మల్యాల ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కాలినడకన, వాహనాల ద్వారా అంజన్న సన్నిధికి చేరుకోనున్నారు. దీక్షాపరులు ఇక్కడ మాల విరమణ చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. కొండగట్టులో జరిగే ఉత్సవాల కోసం అంజన్న ఆలయ పరిసరాల్లో క్యూలైన్, బారి కేడ్లు తదితర ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే నిత్యం వేలాదిగా తరలివస్తూ స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 650మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరంతా షిఫ్ట్ పద్ధతిలో దిగువ కొండగట్టు, ఘాట్ రోడ్డు, కొండపైన, ఆలయం, దీక్షవిరమణ మండపం, ప్రసాదాల కౌంటర్, కోనేరు, పార్కింగ్ స్థలాలు, జేఎన్‌టీయూ, దొంగల మర్రి ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు.

నేటి ఆర్జిత సేవలు రద్దు

శుక్రవారం నుంచి సోమవారం వరకు వరకు కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆర్జిత సేవలు నిలిపి వేస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. ఏప్రిల్ 11నుంచి 13 వరకు జయంతి ఉత్సవాలు జరగనుండగా ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు తదితర పూజలు ఉండవని భక్తులు సహకరించాలని కోరారు. మళ్లీ ఏప్రిల్ 14 నుంచి ఆర్జిత సేవలు యథావిధిగా కొన సాగుతాయని అన్నారు.

ప్రత్యేక అధికారిగా శ్రీనివాసరావు

కొండగట్టు హనుమాన్ చిన్న జయంతి వేడుకల సందర్భంగా ఉత్సవాలు సజావుగా నిర్వహణకు గాను దేవాదాయ శాఖ ఉత్సవాల ప్రత్యేక అధికారిని నియమించింది. అడిషనల్ కమిషనర్ ఇ.శ్రీనివాస్‌రావును ప్రత్యేక అధికారిగా నియమించడంతో కొండపైన దేవస్థానం అధికారులతో ఆయన కలిసి ఏర్పాట్లు, సౌకర్యాలు పర్యవేక్షిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం: శ్రీకాంత్‌రావు, ఈవో

జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. తాగునీటి కోసం చలి వేంద్రాలు, మొబైల్ చలివేంద్రాలు, పార్కింగ్, క్యూలైన్ తదితర ఏర్పాటు చేశాం. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఉత్సవమూర్తుల యాగశాల ప్రవేశం

మల్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చిన్నహనుమాన్ జయంతి నేపథ్యంలో వేలాదిగా తరలివచ్చి మాల విరమణ చేసే దీక్షపరుల కోసం కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన మాల విరమణ మండపానికి స్వామి వారి ఉత్సవమూర్తుల తీసుకెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈవో శ్రీకాంత్‌రావు, స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్, రఘు, అర్చకులు, వేదపండితులు ఉత్సవమూర్తుల దీక్షావిరమణ మండప ప్రవేశంలో పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్ సత్యప్రసాద్

మల్యాల, ఆంధ్రజ్యోతి: చిన్నజయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి కొండగట్టులో ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్, డీఎస్పీ రఘు చందర్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

అంజన్న జయంతికి ఏర్పాట్లు ..

- కొండపైన, ఘాట్‌రోడ్డుపైన, 28 చోట్ల చలివేంద్రాలతో పాటు మొబైల్ వాహనాల ద్వారా భక్తులకు నీటిని అందించనున్నారు.
- ఘాట్‌రోడ్డుపై వాహనాలకు అనుమతి లేకపోగా కొండపైన బొజ్జ పోతన్న, కొండగట్టు స్టేజీల వద్ద పోలీసుల ఔట్ పోస్టు ఏర్పాటు
- దీక్ష విరమణలకు ప్రస్తుతం ఉన్న అర్చకులకు తోడు మరో వంద మంది సిబ్బంది నియామకం
- కొండగట్టు స్టేజీ సమీపంలోని తుమ్మ చెరువు, కొండపైన బొజ్జ పోతన్న ఆలయం, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో బృందావనం రిసార్ట్, జేఎన్‌టీయూ సమీపంలో కొండ పైకి వెళ్లే మార్గంలో, దాని పక్కనే వాహనాల కోసం పార్కింగ్‌కు ఏర్పాట్లు
- పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 366 మంది సిబ్బందితో మూడు షిఫ్టులలో పారిశుధ్య నిర్వహణ
- నాలుగు లక్షల లడ్డూలు తయారీ
- బస్టాండ్ వద్ద ఏడు ప్రసాద, ఏడు టికెట్ కౌంటర్ల ఏర్పాటు
- ఆరు కేంద్రాల్లో మూడు షిఫ్టులలో కొండపైన, స్టేజీ వద్ద వైద్య సిబ్బంది విధులు
- మెట్ల మార్గంలో విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు 24గంటల విద్యుత్ సౌకర్యం, జనరేటర్‌ల ఏర్పాటు
- అందుబాటులో ఫైర్ ఇంజన్, అంబులెన్స్ సౌకర్యం
- భక్తులకు సరిపడా జగిత్యాల, వేములవాడ, కరీంనగర్ నుంచి ఆర్టీసీ బస్సుల సేవలు
- నాలుగు బ్లాక్‌లలో తాత్కాలిక మరుగుదొడ్లు, మొబైల్ మరుగుదొడ్లు





పాదయాత్రగా వస్తున్న దీక్షాపరులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్



ఉత్సవమూర్తుల దీక్ష విరమణ మండప ప్రవేశానికి తీసుకువస్తున్న అర్చకులు

మంత్రుల పర్యటనకు భారీ భద్రత చర్యలు

- 300 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది
- సిరిసిల్ల ఎస్పీ మహేష్ బి గీతే



మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బీ గీతే

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల శివారులో అపెరల్ పార్కులో టెక్స్‌పోర్టుయూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముగ్గురుమంత్రులు వస్తున్న సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ మహేష్ బీ గీతే తెలిపారు. గురువారం జిల్లాపోలీస్ కార్యాలయంలో అధికారులతో భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం అపెరల్ పార్కులో టెక్స్‌పోర్టు యూనిట్ ప్రారంభోత్సవానికి మంత్రులు వస్తున్నా సందర్భంగా దాదాపు 300మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్టభద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు. యూనిట్ ప్రారంభోత్సవ ప్రాంగణంలో వీఐపీ గ్యాలరీ, సభ ప్రాంగణంలో వీవీఐపీ జనరల్ పార్కింగ్ ప్రదేశాల్లో బందోబస్తులో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సదన్‌కుమార్, మధుకర్, నాగేశ్వర్‌రావు, ఆర్ఐలు రమేష్, యాదగిరి, ఎస్ఐలు పాల్గొన్నారు.

84.1శాతం మొబైల్ ఫోన్లు రికవరీ

సిరిసిల్ల క్రైం: జిల్లాలో 84.1శాతం మొబైల్ ఫోన్‌ల రికవరీ చేశామని ఎస్పీ మహేశ్ బి గీతే తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటుచేసిన సందర్భంగా రూ.10లక్షల విలువైన 100ఫోన్‌లను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 1587 ఫోన్‌లను బాధితులకు అందజేశామన్నారు. ఫోన్‌ల రికవరీలో, బాధితులకు అప్పగించడంలో కృషిచేస్తున్న ఐటి కోర్ ఎస్ఐ కిరణ్‌కుమార్, కానిస్టేబుల్ రాజా తిరుమలేష్‌ను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి డీఎస్పీ మురళికృష్ణ, ఐటి కోర్ ఎస్ఐ కిరన్‌కుమార్, ఆర్ఐలు రమేష్, యాదగిరి, ఎస్ఐ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్ జైలుకు వెళ్లడం ఖాయం

- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్‌రావు అధికారాన్ని అడ్డుపెట్టుకొని సంపాదించిన అక్రమాస్తులపై విరారణ జరగుతుందని, వారంతా జైలుకు వెళ్లడం ఖాయమని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం అన్నారు. గురువారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాంకు సంబంధించిన వేలాది ఎకరాల భూమిని తమ బినామీల పేరుమీదకు మార్చడానికే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి తీసుకువచ్చిందని ఆరోపించారు. ప్రాజెక్టులు, విద్యుత్ పేరుతో ఏడు లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో వారు మూడు లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. పదేళ్ల కాలంలో పదివేల ఎకరాల భూమిని వారి బినామిల పేర్లమీదకు వెళ్లాయని ఆరోపించారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే ఎస్సీ వర్గీకరణ చేసిందిని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కృషి చేస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీసీలపై ప్రేమ ఉంటే 42 శాతం రిజర్వేషన్ అమలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని, అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలన్న విషయం కవితకు అప్పుడు ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. సమావేశంలో సమావేశంలో గజ్జెల ఆనందరావు, సముద్రాల అజయ్, సుద్దాల లక్ష్మన్, అనిల్, ప్రభాకర్, శంకర్, కొండ్ర స్వరూప, ఆవారు లత, గొర్రె రాజయ్య, మైసని మనోహర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గణేష్‌నగర్‌లో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శీలం లక్ష్మణ్ ఆదేశాలతో ఏఎస్ఐ అబ్దుల్ జలీల్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరం పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకోగా మరో వ్యక్తి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి 24,900 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

అంతర్ జిల్లా దొంగ పట్టివేత

- రూ.25 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- అరెస్టు చూపించి వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్



దొంగను అరెస్టు చూపిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొన్నినెలలుగా తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌చేసి బంగారుఆభరణాలు దోచుకుంటున్న అంతర్‌జిల్లా దొంగను జగిత్యాలపోలీసులు పట్టుకున్నారు. రూ.25 లక్షల విలువగల 28.6తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఎస్పీ అశోక్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి దొంగను అరెస్టు చూపించి పూర్తివివరాలు వెల్లడించారు. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన బక్కశెట్టికొమురయ్య అలియాస్ రేగులఅజయ్‌కుమార్(53) ఉపాధి కోసం మంచిర్యాల జిల్లాకేంద్రంలోని తిలక్ నగర్‌లో ఉంటూ దొంగతనాలు చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. 10సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో లారీ ట్రాన్స్‌పోర్ట్‌లో పనిచేసే సమయంలో దొంగతనం చేసిన కొమురయ్య చంచల్‌గూడలో జైలు జీవితం అనుభవించాడు. బయటకు వచ్చిన అనంతరం 25దొంగతనాలు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో కొమురయ్య అనుమానాస్పదంగా సంచరిస్తూ పట్టుబడ్డాడు. విచారణలో అంతర్ జిల్లా దొంగగా పోలీసులు గుర్తించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మూడు నెలల వ్యవధిలో ఏడు చోట్ల కొమురయ్య దొంగతనాలు చేసి 28.6 తులాల విలువైన బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడంతో పాటు బంగారు ఆభరణాలు రికవరీ చేసిన టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణు గోపాల్, ఎస్సైలు కిరణ్ కుమార్, గీతను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ రఘు చందర్ తదితరులు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

బైకును వెనుక నుంచి ఢీకొట్టిన కారు

- చికిత్స పొందుతూ ఒకరు మృతి

శంకరపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్‌శివారులో ఫ్లైఓవర్ దగ్గర ద్విచక్రవాహనాన్ని కారు వెనుకనుంచి ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, ఒకరు చికిత్సపొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్‌మండలం గర్రెపల్లికి చెందిన కౌడగాని కిషన్‌రావు, తనభార్య శోభ(50), కూతురు అశ్వినితోకలిసి ద్విచక్రవాహనంపై ఎల్లంపల్లి నుంచి మానకొండూర్ మండలం నిజాయితీగూడెం వెళ్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం తాడికల్ శివారులోని ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే కారు(ఏపీ09సీడబ్ల్యూ 0882) వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కిషన్‌రావు, అతని భార్య శోభ తలకు, తొంటి ఎముకకు, కూతురు అశ్వినికి రెండు కాళ్లకు, కంటి వద్ద తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శోభను మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. కిషన్‌రావు బావమరిది బూరాల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

కేజ్ కల్చర్ యూనిట్ల పరిశీలన

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో చీర్లవంచ వద్ద ఫిషిన్ ఫార్మా ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ యూనిట్‌ను గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ యూనిట్‌లలో 4.2 లక్షల విత్తనాలను నిల్వ చేశారు. ప్రస్తుతం మిడ్ మానేరులో నీటి మట్టం తగ్గిపోతుండడంతో ఎక్కువగా పంజరాలను ఏర్పాటు చేయలేకపోతున్నామన్నారు. నీటి మట్టం 8 టీఎంసీలు మాత్రమే ఉన్నందున వేసవి కాలం పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా హెచ్చు తగ్గులు సంభవించే అవకాశం ఉందని ఫిషిన్ ఫాం ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. మిడ్ మానేరు ప్రాజెక్టులో నీరు ఎక్కువ కాలం అధిక లోతు ఉండి ఇతర జలచరాల భద్రతకు భంగం కలగకుండా ఉండే అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వారి వెంట జిల్లా ఫిషరీస్ అధికారి సౌజన్యలు ఉన్నారు.



సూచనలు చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం

- అభివృద్ధి నెపంతో మరోమారు కాంగ్రెస్ ముసుగులో జగిత్యాల ఎమ్మెల్యే అరాచకం
- మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



జగిత్యాలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేశారని, ప్రస్తుతం అభివృద్ధి నెపంతో కాంగ్రెస్ ముసుగులో మరోమారు అరాచకం చేయడానికి యత్నిస్తున్నాడని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా తాతల..తండ్రుల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ మాదేనని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అంటుండడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ దౌర్జన్యం తట్టుకోలేక హబ్సీపూర్ గ్రామానికి చెందిన యువకుడు సారంగపూర్ అడవుల్లో ఉరివేసుకొని మృతి చెందిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. జగిత్యాలకు చెందిన బ్లాక్ కాంగ్రెస్ నాయకుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయించారని, బీఆర్ఎస్‌లో చేరనందుకు తుంగూరు సర్పంచ్‌ను పదవి నుంచి సస్పెండ్ చేయించారని ఆరోపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి కీలక పాత్ర పోషించిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తానని జీవన్‌రెడ్డి తెలిపారు. గతంలో జగిత్యాలలో ఇళ్లు లేని నిరుపేదలకు 4వేల వ్యక్తిగత ఇళ్లు మంజూరు చేయించి నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. కొడిమ్యాల మండలం నాచుపల్లి వద్ద జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, పొలాసలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, నూకపల్లి వద్ద న్యాక్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కృషి చేశానని జీవన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో రాయికల్, పొలాస, బీర్పూర్ సీపీడబ్ల్యూ స్కీమ్ కోసం రూ.15 కోట్లు మంజూరు చేయించానన్నారు.

ఈ సమావేశంలో టీపీసీసీ సెక్రెటరీ బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, గుంటి జగదీశ్వర్, రాధాకిషన్ రావు, పుప్పాల అశోక్, జితేందర్, మహిపాల్, మధు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కరీంనగర్ టౌన్: ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు సభ్యులకు రెండు లక్షల రూపాయల ప్రమాదబీమా సౌకర్యాన్ని వర్తింపజేస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

గణేశ్‌నగర్: నగరంలోని ఎస్ఆర్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జంతు శాస్త్ర విభాగం తృతీయ సంవత్సర విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా కొత్తపల్లి చెరువులో సూక్ష్మ జీవకాలను సేకరించారు.

- నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన విలువలతో కూడిన విద్య అనే అంశంపై సర్టిఫికెట్ కోర్స్ ముగిసింది.

భగత్‌నగర్: తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్‌కు సర్కిల్ ఆఫీస్ ఆవరణలో క్వార్టర్ కేటాయించాలని టీజీఈఈయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లనువాల స్వామి డిమాండ్ చేశారు.

- కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో జాతీయ సిబ్లింగ్స్ (తోబుట్టువులు) దినోత్సవాన్ని నిర్వహించారు.

కరీంనగర్ కల్చరల్: జిల్లాలోని బొమ్మకల్, హౌజింగ్‌బోర్డ్ కాలనికి చెందిన అభయాంజనేయస్వామి, అయ్యప్ప దేవాలయ ప్రధానార్చకుడు తాటిచెర్ల హరికిషన్‌శర్మ ఈనెల 30న దిశ యూనివర్సిటీ బెంగుళూరు గౌరవ డాక్టరేట్ అందుకోనున్నాడు.

- విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లాకు చెందిన వేమన కవితామయం, హైదరాబాద్‌కు చెందిన తపస్వి మనోహరం సంయుక్తంగా నిర్వహించిన కవితా సంపుటి పోటీల్లో కరీంనగర్‌కు చెందిన రచయిత వైరాగ్యం ప్రభాకర్ రచించిన 'ఆకాశమంత' కవితా సంపుటి జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైంది.

- జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో కాశ్మీర్ గడ్డలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రెండో హజ్ శిక్షణా కార్యక్రమం జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ రియాజ్ అలీ రజ్వి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర హజ్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్‌గులాం అఫ్జల్ బియాబాని హాజరయ్యారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమపథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం శంకరపట్నం మండలంలోని అంబాలాపూర్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి పర్యటించారు. అంబాలాపూర్‌లో ఓ మహిళ తన భర్త వైద్యానికి ఎంతో ఖర్చుపెట్టానని అయినా కోలుకోలేదని ఎమ్మెల్యేకు మొరపెట్టుకుంది. స్పందించిన ఆయన ప్రభుత్వం 10లక్షల వరకు ఎల్వోసీ ద్వారా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుందని ఆమెకు తెలిపారు. తనవంతు సాయం చేస్తానని ఆమెకు హామీ ఇచ్చారు.

● లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ..

శంకరపట్నం/తిమ్మాపూర్: శంకరపట్నం మండల కేంద్రంలోని మాధవసాయి గార్డెన్‌లో, ఎల్ఎండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.




శంకరపట్నంలో కల్యాణలక్ష్మి చెక్కులను, తిమ్మాపూర్‌లో బాధితుడికి మూడుచక్రాల బైక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మూడుచక్రాల బైక్ అందజేత

తిమ్మాపూర్: రోడ్డు ప్రమాదంలో కాళ్లు చతికిలబడి నడవలేని పరిస్థితిలో ఉన్న వ్యక్తికి మూడుచక్రాల బైక్ అందజేశారు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ. మండలంలోని రేణికుంటలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పర్యటించినప్పుడు గ్రామానికి చెందిన బోయిని సంపత్ అనే వికలాంగుడు ఎమ్మెల్యేతో తన గోడు వెళ్లబోసుకున్నాడు. దీంతో ఎమ్మెల్యే సత్యనారాయణ స్పందించి బ్యాటరీబైక్‌ను అందజేశారు.

దేశానికి కాంగ్రెస్సే శ్రీరామ రక్ష

మానకొండూర్: భారతదేశానికి కాంగ్రెస్ పార్టీయే శ్రీ రామరక్ష అని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని సదాశివపల్లి, ముంజంపల్లిలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్‌చైర్మన్ తిరుమల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీంద్రాచారి పాల్గొన్నారు.

మహనీయుల జయంత్యుత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్/గణేశ్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న మహనీయుల జయంత్యుత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి, యూనివర్సిటీ వీసీ యు ఉమేశ్‌కుమార్ ఆవిష్కరించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ అన్ని డిగ్రీ, పీజీ అనుబంధ కళాశాలల సమన్వయంతో విశ్వవిద్యాలయ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో సంయుక్తంగా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంత్యుత్సవాల సందర్భంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 11న ఉదయం 6.30 గంటలకు తెలంగాణచౌక్ నుంచి శాతవాహన యూనివర్సిటీ వరకు ర్యాలీ, 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వ్యాస రచన పోటీలను సైన్స్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఈనెల 12న ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కామర్స్ కళాశాల ఆవరణలో రంగోలి కార్యక్రమం, 10 నుంచి 1 గంట వరకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 13న కామర్స్ కళాశాల సెమినార్ హాల్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. 14న ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించి ముగింపు కార్యక్రమాలను చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఇ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న కలెక్టర్, ఎస్‌యూ వీసీ

డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్టీఆర్‌చౌరస్తా సమీపంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎన్టీఆర్ చౌరస్తాలో ఉన్న పెండింగ్ డ్రైనేజీ పనులను, అనంతరం 44వ డివిజన్లలో కమిషనర్ పర్యటించి పలు సమస్యలను పరిశీలించి, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ చౌరస్తా వద్ద పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. 44వ డివిజన్‌లో ప్రధాన మురుగునీటి కాలువ నిర్మాణ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమం లో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, డీఈ ఓం ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూలో తరగతుల బహిష్కరణ

గణేశ్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అధ్యాపకుల అరెస్టుకు నిరసనగా శాతవాహన విశ్వవిద్యాలయంలో గురువారం తరగతుల బహిష్కరణ చేశారు. శాతవాహన యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ జోసఫ్ రాజ్, కోఆర్డినేటర్స్ డాక్టర్ రాజు, డా. కృష్ణకుమార్, డాక్టర్ విజయ్‌ప్రకాష్, డా. అనిల్, డాక్టర్ అర్చన, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

భగత్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై ఆర్టీసీ కరీంనగర్-1 డిపోలో ఫైర్ సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు ఎన్నిరకాలు, ఏ అగ్నిప్రమాదాన్ని ఎలా నివారించాలో సిబ్బందికి ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, డిపో మేనేజర్ బి విజయమాధురి, వీరస్వామి, కిషన్, ఏవీఆర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో తిరుగులేని శక్తిగా బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ప్రవీణ్‌రావు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ తిరుగులేని శక్తిగా అవతరించిందని భవిష్యత్ అంతా తమదేనని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. మండలంలోని చామనపల్లిలో బీజేపీ క్రియాశీల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రవీణ్‌రావు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపిని అడుగు పెట్టనీయమని సీఎం రేవంత్‌రెడ్డి పగటికలలు కంటున్నాడని ఎద్దేవా చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ



హనుమాన్ మాలదారులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న జయపాల్‌రెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని హనుమాన్ మాలదారులకు మైత్రీ గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి సహకారంతో, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ డి సంపత్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం గురువారం అందించారు. చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కొత్త జయపాల్‌రెడ్డి, డి సంపత్, బ్రహ్మం, నల్ల ఆదిరెడ్డి, శ్రీను, విజయ్, శివ, ఎడవెల్లి కుమార్, జయపాలన్న మిత్రమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కరీంనగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం 2025-26 ఎన్నికలను శుక్రవారం నిర్వహించనున్నారు. బార్ అసోసియేషన్‌లో 927 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షులుగా డి మల్లయ్య, లింగంపల్లి నాగరాజు, కొరివి వేణుగోపాల్ పోటీ చేస్తున్నారు. అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా గంది రజని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కాసుగంటి మాధవరావు ప్రకటించారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తారు. ఓటు హక్కును వినియోగించుకునే వారు విధిగా ఐడీ కార్డును తీసుకొని రావాలని ఎన్నికల అధికారి తెలిపారు.

'రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు నీరాజనం'



పాదయాత్రలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు

కరీంనగర్ అర్బన్/కరీంనగర్ రూరల్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 1, 2, 20, 23 డివిజన్లలో, కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, తాజా మాజీ కార్పొరేటర్ ఆర్ష కిరణ్మయి మల్లేశం, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ' వైద్య శిబిరం సందర్శన

సుభాష్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌజింగ్ బోర్డు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళ ఆరోగ్య వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన మహిళలను వారికి అందుతున్న వైద్య సేవల గురంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరెపల్లి బస్తీదవాఖానలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, ఫార్మసీ, మందుల నిల్వలు, రోగులకు అందజేస్తున్న మందులను పరిశీలించారు. కార్యక్రమంలో హౌజింగ్ బోర్డు కాలనీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిప్రసాద్, ఎస్‌హెచ్ఎం డీపీవో స్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

'అల్ఫోర్స్' విద్యార్థులకు ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రీజనింగ్, అప్టిట్యూడ్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. గురువారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభినందించారు. సిల్వర్జోన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ఎల్ రామన్, ఎం శివన్‌రెడ్డి, క్రిష్ణ చైతన్య, జి సాయి సంహిత్, పి శ్లోక, ఎం హిమేష్ చంద్ర, ఉదయశ్రీ పతకాలు సాధించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకువన్నె తేవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట: ఎమ్మెల్యే సత్యం

రామడుగు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట శుభం ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సంబంధించి 121 మంది లబ్ధిదారులకు ఒక కోటి 21 లక్షల 14036 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొమ్మ రవేణి తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ సత్యం రెడ్డి, మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ హరీష్, తహసిల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో శ్రవణ్, నాయకులు ఎడవల్లి నరేందర్ రెడ్డి, మోర భద్రేశం, పులి ఆంజనేయులుగౌడ్, కోల రమేష్, వీర్ల నర్సింగరావు, శ్రీనివాస్‌గౌడ్, పరశురాములు, మల్లేశం, తదిత రులు పాల్గొన్నారు.



గోపాల్‌రావుపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

పాదయాత్ర

మండలంలోని గోపాల్‌రావుపేటలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కార్యకర్తలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమిత్‌షాతోసహా బీజేపీ నాయకులు, కేంద్రప్రభుత్వ విధానాలు రాజ్యాంగంపై దాడి చేస్తున్నట్లుగా ఉందన్నారు. నిరంకుశ పాలన వైఖరికి నిరసనగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. దేశ ప్రజలను జాగ్రుతం చేయడానికే పాదయాత్ర చేపట్టామన్నారు.

ఆకాశమే హద్దుగా అవకాశాలు: ఏసీపీ

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆకాశమే హద్దుగా అవకాశాలు ఉన్నాయని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి అన్నారు. మండలంలోని సింగాపూర్‌లోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విబ్జియార్-2025 ముగింపు వేడుక గురువారం జరుగగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థానాలకు ఎదగాలంటే క్రమశిక్షణను అలవర్చుకోవాల సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు ఉన్న విద్యార్థులకు అపార అవకాశాలు ఉన్నాయ ని తెలిపారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కిట్స్‌కళాశాల ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ ఇంద్రనీల్, ప్రిన్సిపాల్ హనుమ కుమార్, సీఐ తిరుమల్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జి

అవీ.. ఇవీ..

ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లి గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుపనులను ఎంపీడీవో జిల్లెల పుల్లయ్య గురువారం ప్రారంభించారు.

శంకరపట్నం: కులగణన సర్వే డాటా ఎంట్రీ నిధులు వెంటనే విడుదల చేయాలని బీసీ ఆజాది రాష్ట్ర అధికార ప్రతినిధి బొంగోని అభిలాష్‌గౌడ్ ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని వెంటనే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, మాజీకౌన్సిలర్ శ్రీపతి నరేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గురువారం రాజ్యాంగపరిరక్షణ పాదయాత్ర చేపట్టారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దర్మారానికి చెందిన శనిగరపు రాజయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితం అయ్యాడు. ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకుడు ఐఏఎస్ పరికిపండ్ల నరహరి చొరవతో కో-ఆర్డినేటర్ గాదె గుణసాగర్ బాధితవ్యక్తికి వీల్‌చైర్ అందజేశారు.

-జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మానసిక దివ్యాంగ పాఠశాలలో డాక్టర్ ముక్క నవీన్ - డాక్టర్ స్వాతి దంపతులు రూ.2.50లక్షల వ్యయంతో రేకుల షెడ్, వరండా నిర్మించారు. గురువారం డాక్టర్ శ్రీకృష్ణమూర్తి-అరుణ దంపతుల చేతుల మీదుగా రేకుల షెడ్‌ను ప్రారంభించారు.

-జమ్మికుంట పట్టణంలోని కొండూర్ కాంప్లెక్స్‌లో భద్రాద్రి బ్యాంకు బ్రాంచ్‌ను చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఒక్కశాఖతో మొదలైన తమ బ్యాంకు నేడు 23వ శాఖను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

గంగాధర: రైతులకు నాణ్యమైన విత్తనాలనే అమ్మాలని ఏడీఏ ప్రియదర్శిని డీలర్లను ఆదేశించారు. గురువారం గంగాధర రైతువేదికలో మండల ఫెర్టిలైజర్, విత్తన, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ సీడ్, ఎరువులు, పురుగుల మందుల వివరాలను రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.

ఘనంగా గజవాహన సేవ



గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఇల్లందకుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ప్రభుత్సోత్సవం అనంతరం ఘనంగా గజవాహన సేవ ప్రారంభించారు. నిత్యవిధి అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ఘనంగా పూలతో అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను గజవాహనంపై అధిరోహించారు. డప్పుచప్పుళ్లు, మేళతాళాలు, భాజాభజంత్రీలు, వేదబ్రహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమహనుమత్ నామస్మరణచేస్తూ ఆలయప్రాంగణంలో స్వామివారిని ఊరేగించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

పలు గ్రామాల్లో పోషణ పక్షం

హుజూరాబాద్‌రూరల్/తిమ్మాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని కాట్రపల్లిలో, తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ, రామకృష్ణ కాలనీ, తిమ్మాపూర్ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్‌పక్వాడాలో భాగంగా గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవోలు సుగుణ, శ్రీమతి మాట్లాడుతూ గర్భిణులు సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆహారంలో ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలన్నారు. పుట్టినబిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని సూచించారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

● కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మేకల తిరుపతి

హుజూరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచినగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్య క్షుడు మేకల తిరుపతి అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లీటర్ పెట్రోల్ రూ.70 ఉండగా, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.110కి పెరిగిందన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7600పలికింది. గురువారం మార్కెట్‌యార్డుకు ఏడుగురు రైతులు 127క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7600, కనిష్ఠ ధర రూ.7400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించండి

చొప్పదండి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.వరికోతలు ప్రారంభమైనందున వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారని, వెంటనే కొనుగోళ్లను చేపట్టాలని ఆయన కోరారు.

దేవంపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

మానకొండూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి గ్రామంలో గురువారం ఉచితపశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం పీవీ నర్సింహారావు వెటర్నరీ పాలిటెక్నిక్, కరీంనగర్‌లోని జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో కొనసాగింది. 45పశువులకు వైద్యపరీక్షలు చేసి చూడి పరీక్షలు నిర్వహించారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కార్తీక్, డాక్టర్ వినీత, మానకొండూర్ వైద్యులు సుస్మితారెడ్డి, అరవింద్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గాయత్రి కళాశాలలో వీడ్కోలు హంగామా

జమ్మికుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రి డిగ్రీ, పీజీకళాశాలలో గురువారం వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ ముష్క వీరరాజు, ప్రిన్సిపాల్ సర్దన కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అధ్యాపకులు

రేపటి నుంచి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

గంగాధర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట్ల నర్సింహులపల్లె లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుంచి ప్రారంభమవుతున్నట్లు ధర్మాధికారి కల్వకోట కీర్తికుమార్ తెలిపారు. 12న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 14న పుష్పయాగం, నాకబలి, ఏకాంతసేవతో ముగుస్తాయని తెలిపారు. గ్రామమాజీసర్పంచ్ తోటమల్లారెడ్డి ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఆహ్వానించారు.

ఫ్లెక్సీ తొలగింపు

గంగాధర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఫ్లెక్సీ తొలగింపుపై మాజీసర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి గురువారం ఎంపీడీవో రాముకు ఫిర్యాదు చేశారు. మధురానగర్‌లో గట్టుబూత్కూర్ మాజీసర్పంచ్ విజేందర్‌రెడ్డి హోర్డింగ్ ఫ్లెక్సీలున్నాయి. బుధవారం రాత్రి విజేందర్‌రెడ్డికి చెందిన ఫ్లెక్సీని గ్రామాధికారులు తొలగించారు. దీనిపై విజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కక్షపూరితంగా అధికారులు ఫ్లెక్సీని తొలగించారన్నారు.

పరామర్శ

ఇల్లందకుంట/జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలకేంద్రానికిచెందిన సిరికొండ సదానందం, జమ్మికుంటమండలం శాయంపేట గ్రామానికిచెందిన పుల్యాల ఓదెమ్మ అనారోగ్యంతో మృతిచెందగా, గురువారం మృతుల కుటుంబసభ్యులను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్నపరామర్శించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.